బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 01 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4


## గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోండి

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

బలగం టీవీ, హైదరాబాద్

రాబోయే వినాయక చవితి పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలని, గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ చెప్పారు. నవరాత్రి ఉత్సవాల్లో అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు. కరీంనగర్ పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, అధికారుల సమన్వయ సమావేశాన్ని పోలీస్ హెడ్ క్వార్టర్స్ లో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ కరీంనగర్ గణేష్ ఉత్సవాల్లో ఎటువంటి ఘటనలూ జరిగిన చరిత్ర లేదని, నిర్వాహకులు ఆ ఆనవాయితీని కొనసాగించాలని కోరారు. ఉత్సవాలకు సంబంధించి సోషల్ మీడియాలో వచ్చే అనవసరమైన వీడియోలను, ఫోటోలను ట్రోల్ చేయవద్దని సూచించారు. నవరాత్రి ఉత్సవాలకు కావలసిన అన్నిరకాల ఏర్పాట్లను సమయానికి ముందే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అవసరమైతే ఏర్పాట్ల విషయంలో ప్రైవేట్ వ్యక్తులు సంస్థల సహాయం కూడా తీసుకోవాలని అన్నారు. కరీంనగర్ లోని గణేష్ మండపాలకు అవసరమైన విద్యుత్ బిల్లును తాను మిగితా 2వ పేజీలో

# హుస్సేన్ సాగర్ చుట్టూ స్కైవాక్

- గోల్కొండ చుట్టూ ఆక్రమణలుంటే తొలగించాలి
- బాధితులు ఎవరైనా ఉంటే వారికి పునరావాసం కల్పించాలి
- బుద్ధ వనా న్ని అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రంగా అభివృద్ధి చేస్తాం
- హైదరాబాద్-నాగార్జునసాగర్‌కు ఫోర్ లేన్ రహదారి
- సీఎం రేవంత్ రెడ్డి



బలగం టీవీ, హైదరాబాద్

హైదరాబాద్ హుస్సేన్ సాగర్ చుట్టూ స్కై వాక్ వే ఏర్పాటు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ట్యాంక్ బండ్, తెలంగాణ అమరవీరుల జ్యోతి, నెక్లెస్ రోడ్, సంజీవయ్య పార్క్ వరకు గుండ్రంగా స్కై వాక్ వే డిజైన్ చేయాలని అధికారులకు సూచించారు. అనుభవం ఉన్న కన్సల్టెన్సీలు, నిపుణులతో అంతర్జాతీయ స్థాయి డిజైన్లు తయారు చేయించాలన్నారు. పర్యాటకులు ఆహ్లాదంగా గడిపేలా ఫుడ్ కోర్టులు, వివిధ స్టాళ్లు ఏర్పాటు చేసి ఈ ప్రాంతాన్ని సిటీలో సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు.

గోల్కొండ చుట్టూ ఇరుకుగా ఉన్న రోడ్లను సీఎం విశాలంగా అభివృద్ధి చేయాలన్నారు ఆక్రమణలు ఉంటే తొలగించాలన్నారు. రోడ్ల విస్తరణలో స్థానికులు, దుకాణదారులు నిరాశ్రయులు కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బాధితులు ఎవరైనా ఉంటే వారికి వేరే చోట పునరావాసం కల్పించాలని చెప్పారు.

నాగార్జున సాగర్ బుద్ధవనంలో అంతర్జాతీయ స్థాయి బుద్ధ మ్యూజియం ఏర్పాటు చేస్తామని చెప్పా రు. సాగర్ లో బుద్ధవనాన్ని టూరిజం హబ్ గా, స్పిరిచువల్ డెస్టినేషన్ సెంటర్ గా తీర్చిదిద్దుతామన్నారు.

నాగార్జున డ్యామ్ అందాలతో పాటు పరిసరాల్లోని బుద్ధ వనా న్ని అంతర్జాతీయ బౌద్ధ క్షేత్రంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. నాగార్జున సాగర్ సందర్శకకు వెళ్లే పర్యాటకులు బ్యాక్ వరకు బోట్ లో విహరించే ఏర్పాట్లు పునురుద్ధి రించాలని సీఎం నిర్ణయించారు. దేశ విదేశాల నుంచి వచ్చే పర్యాటకులను ఆకర్షించేందుకు అనువైన టూరిజం ప్యాకేజీలు రూపొందిస్తామని చెప్పారు. హైదరాబాద్-నాగార్జునసాగర్ ఫోర్ లేన్ రహదారి నిర్మిస్తామని తెలిపారు.

రాష్ట్రంలోని బౌద్ధరామాలు, పర్యాటక స్థలాలనుఅంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దాలన్నారు. చారిత్రకంగా పేరొందిన ఫణిగిరి, నేలకొండపల్లి, నాగార్జునసాగర్ బౌద్ధ క్షేత్రాలతో పాటు హుస్సేన్ సాగర్ లోని బుద్ధ విగ్రహాన్ని ఒకే టూరిజం సర్క్యూట్ గా అభివృద్ధి చేయాలని సూచించారు.

# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు..



- నేడు పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం
- హైదరాబాద్‌లో సోమవారం పాఠశాలలకు సెలవు

బలగం టీవీ, హైదరాబాద్

బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం ఎఫెక్ట్‌తో తెలుగు రాష్ట్రాల్లో జోరుగా వర్షాలు కురుస్తున్నాయి. ఏపీ, తెలంగాణ వ్యాప్తంగా వర్షాలు పడుతున్నాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. రోడ్లపై వరద నీరు చేరడంతో వాహనాదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏపీలో పలు రైళ్లను రద్దు చేశారు. లోతట్టు ప్రాంతాల ప్రజల్ని అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. ఏపీలో మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లొద్దని నిషేధం విధించారు. హైదరాబాద్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఉమ్మడి ఉభయ గోదావరి, కృష్ణా, గుంటూరు జిల్లాలకు రెడ్ అలెర్ట్ జారీ చేసింది వాతావరణ శాఖ. అల్లూరి, విశాఖ, అనకాపల్లి, కాకినాడ జిల్లాలకు ఆరెంజ్ అలెర్ట్ జారీ చేసింది.

వాయుగుండం ప్రభావంతో తెలంగాణ రాష్ట్రానికి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ప్రస్తుతం బంగాళాఖాతంలో వాయుగుండం కొనసాగుతోందన్నారు. ఆదివారం తెల్లవారుజామున కళింగపట్నం, విశాఖపట్నం, గోపాల్‌పూర్ తీర ప్రాంతాల్లో తీరం దాటే అవకాశం ఉందన్నారు. ఈ వాయుగుండం ప్రభావంతో తెలంగాణలో భారీ నుంచి అతి భారీ వర్షం కురిసే మిగితా 2వ పేజీలో

# ఆడపిల్లలు రోడ్డెక్కితే స్పందించరా..?



- ముఖ్యమంత్రి ఏం చేస్తున్నారు..
- గురుకులాల్లో కేసీఆర్ సన్న బియ్యంతో అన్నం పెడితే.. కాంగ్రెస్ ప్రభుత్వం గొడ్డుకారంతో పెడుతుంది
- 500 మంది విద్యార్థులు ఆసుపత్రుల పాల య్యారు.. 38 మంది చనిపోయారు
- గురుకులాలను గాలికి వదిలేశారు.. విద్యా శాఖను పట్టించుకోవడం లేదు
- మాజీ మంత్రి హరీశ్‌రావు
- రంగారెడ్డి జిల్లా, పాలమాకుల గురుకుల పాఠశాలను సందర్శించిన మాజీ మంత్రులు హరీశ్‌రావు, సబితా ఇంద్రా రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్

ఆడపిల్లలు రోడ్డెక్కి ధర్నా చేస్తుంటే ఈ ప్రభుత్వం ఉన్నట్టా..? లేనట్టా..? అని నిలదీశారు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు . ఆడపిల్లలు రెండు కిలోమీటర్లు నడిచి జాతీయ రహదారి మీద ధర్నా చేస్తే ఈ ప్రభుత్వం నుండి ఇప్పటి వరకు స్పందన లేదని మండిపడ్డారు. రంగారెడ్డి జిల్లాలోని పాలమాకుల కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డితో కలిసి హరీశ్‌రావు శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అక్కడి విద్యార్థినులు తమ గోడును వెల్లబోసుకున్నారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ, పిల్లల బాధ తెలుసుకోవాలని ఇక్కడికి వచ్చాం... పిల్లల కళ్లలో నీళ్లు కారిపోతున్నాయి. దుఃఖాన్ని ఆపులేకపోతున్నారని... భయంతో వణికిపోతున్నారని చెప్పారు. ఇప్పటికే విపరీతంగా కర్రలు విరిగిపోయేలా కొడుతున్నారని ఏడుస్తున్నారన్నారు. పిల్లల పరిస్థితి చూస్తుంటే తమ కళ్లల్లో కూడా నీళ్లు ఆగలేదని.. అన్నంలో పురుగులు వస్తున్నాయని చెబితే, వాటిని తీసేసి తినండిని టీచర్లు చెబుతున్నారని పిల్లలు చెప్పారన్నారు. పాఠాలు సరిగా చెప్పడం లేదని.. మంచి భోజనం లేదని.. కనీస సౌకర్యాలు కూడా లేవని పిల్లలు బాధపడుతున్నారని తెలిపారు. ఒక జత బట్టలు మాత్రమే ఇచ్చారని ఆరో తరగతి పిల్లలు చెబుతున్నారు. బుక్స్ కూడా ఇవ్వలేదు. బట్టలు రావు.. పుస్తకాలు రావు.. కడుపు నిండా భోజనం పెట్టే పరిస్థితి లేదు. గతంలో కేసీఆర్ సన్నబియ్యంతో భోజనం పెడితే.. ఇవాళ గొడ్డుకారంతో భోజనం పెడుతున్నారు. ప్రతి రోజు కోడిగడ్డు ఇవ్వాలని ఉంది. వారానికి రెండుసార్లు ఇస్తున్నారు. ఆ కోడిగుడ్లు వాసన వస్తున్నాయని, వాటిని తినకలేకపోతున్నామని పిల్లలు బాధపడుతున్నారని హరీశ్‌రావు తెలిపారు.

రేవంత్ మాటలు కోటలు దాటుతాయి కానీ చేతల్లో మాత్రం శూన్యం అంటూ మండిపడ్డారు . రేవంత్ రెడ్డి యూ ఆర్ ఏ ఫెయిల్యూర్ చీఫ్ మినిస్టర్.. నువ్వు పూర్తిగా విఫలం అయిపోయావు అంటూ మండిపడ్డారు. మిగితా 2వ పేజీలో

# 1,864 స్కూళ్ల మూసివేతకు కుట్ర..

- సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్



బలగం టీవీ, హైదరాబాద్

రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పాఠశాల విద్యను తీవ్ర నిర్లక్ష్యం చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులను చదువుకు దూరం చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు లేరన్న కారణంతో ఈ ఏడాది దాదాపు గా 1,864 స్కూళ్లను మూసేసే ప్రయత్నం చేస్తున్నారని వార్తలు వస్తున్నాయి... ఇదే నిజమైతే ఇంతకన్నా ఆందోళన చెందాల్సిన అంశం మరొకటి లేదన్నారు.

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాల్సిన ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టకుండా స్కూళ్లను మూసి వేయాలని భావిస్తుండటం సిగ్గుచేటన్నారు. 2024లో ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల సంఖ్య అంతకుముందు ఏడాదితో పోల్చుకుంటే దాదాపు 2.4 లక్షలు తగ్గింది. ఇది రాష్ట్ర విద్యారంగానికి ప్రమాద సంకేతమని ఆందోళన వ్యక్తం చేశారు. 8 నెలల కాలంలోనే ప్రభుత్వ విద్యను కాంగ్రెస్ సర్కార్ అస్తవ్యస్థం చేసిందని మండిపడ్డారు. అసలు ప్రభుత్వ స్కూళ్లలో విద్యార్థుల సంఖ్య ఎందుకు తగ్గుతుందో గుర్తించి ఆ సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం నిద్రావస్థలో ఉండటంతోనే ఈ దుస్థితి దాపురించిందన్నారు.

ప్రధానంగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా టీచర్ల సంఖ్య లేకపోవటంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు తగ్గుతున్నాయని కేటీఆర్ ఆరోపించారు. రాష్ట్రంలో దాదాపుగా 25 వేల టీచర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వెంటనే వాటిని భర్తీ చేయాల్సిన అవసరముందన్నారు. సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వమే సమస్యలను సృష్టిస్తోందని మండిపడ్డారు. విద్యార్థులు లేరంటూ స్కూళ్లను మూసివేయటం, టీచర్లను డిప్యూటేషన్ మీద ఇతర స్కూళ్లకు పంపించటంతో చాలా చోట్ల విద్యార్థులకు ప్రభుత్వ విద్య దొరకని పరిస్థితి ఏర్పడిందన్నారు. దీనికి తోడు సరైన మౌలిక వసతులు లేకపోవటం, నాణ్యమైన ఆహారాన్ని అందించకపోవటం, స్కూళ్లలో, సంక్షేమ వసతి గృహాల్లో శుభ్రత, భద్రత లేని పరిస్థితి నెలకొనటంతో ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలంటేనే తల్లితండ్రులు భయపడే పరిస్థితిని కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకొచ్చిందని దుయ్యబట్టారు.

గత కొన్ని రోజులుగా గురుకుల స్కూళ్లలో జరుగుతున్న సంఘటనలు, వసతి గృహాల్లో విషాహారం, భద్రత లేని పరిస్థితులు, విద్యార్థులు లేరంటూ స్కూళ్లను మూసివేస్తున్న ఘటనలు ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. ఇది తెలంగాణ సమాజానికి ఎంతమాత్రం మంచిది కాదని కేటీఆర్ అన్నారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించటం ప్రభుత్వం బాధ్యత. ఆ బాధ్యత నుంచి తప్పించుకునేందుకు రేవంత్ సర్కార్ కుంటి సాకులు వెతుక్కుంటుందని కేటీఆర్ విమర్శించారు.

కేసీఆర్ పదేళ్ల పాలనలో ప్రభుత్వ విద్యను ప్రోత్సహించేందుకు ఎన్నో కార్యక్రమాలను చేపట్టిన విషయాన్ని ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తు చేశారు. గతంలో ఎప్పుడు లేని విధంగా వెయ్యికి పైగా గురుకుల పాఠశాలలను ప్రారంభించటంతో పాటు విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించామని గుర్తు చేశారు. ప్రభుత్వ మిగితా 2వ పేజీలో

## ఆరుగురు అధికారులపై క్రిమినల్ కేసులు

బలగం టీవీ, హైదరాబాద్

చెరువుల్లో కట్టడాలకు అనుమతులిచ్చిన అధికారులపై చర్యలకు సిద్ధమైంది. ఆరుగురు అధికారులపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేసింది. హైడ్రా ఫిర్యాదుతో సైబరాబాద్ ఆర్థిక నేర విభాగంలో కేసులు నమోదు చేశారు. నిజాంపేట మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, చందానగర్ జీహెచ్ఎంసీ డిప్యూటీ కమిషనర్ సుదామ్స్, బాచుపల్లి ఎమ్మార్వో పూల్ సింగ్, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ల్యాండ్ రికార్డ్స్ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీనివాసులు, హెచ్ఎండీఏ అసిస్టెంట్ ప్లానింగ్ ఆఫీసర్ సుధీర్ కుమార్, హెచ్ఎండీ సిటీ ప్లానర్ రాజ్‌కుమార్‌పై కేసులు నమోదు చేసినట్లు సైబరాబాద్ సీపీ అవినాష్ తెలిపారు.

ఇదిలా ఉండగా హైదరాబాద్‌లో హైడ్రా కూల్చివేతలు కొనసాగుతున్నాయి. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని గగన్‌పహాడ్‌లో అక్రమ నిర్మాణాలను అధికారులు కూల్చివేస్తున్నారు. భారీ బందోబస్తు నడుమ అప్ప చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో ఆక్రమణలను తొలగిస్తున్నారు. ప్లాస్టిక్ గోదాం సహా ఇతర నిర్మాణాలను నేలమట్టం చేస్తున్నారు.

## తెలంగాణలో ఐఏఎస్‌ల బదిలీ

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో పలువురు ఐఏఎస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేయడంతో పాటు అదనపు బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు శనివారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు. గనులశాఖ డైరెక్టర్‌గా కే సురేంద్ర మోహన్‌కు అదనపు బాధ్యతలు అప్పజెప్పింది. భూసేకరణ, పునరావాస కమిషనర్‌గా టీ వినయ్ కృష్ణారెడ్డికి అదనపు బాధ్యతలు ఇచ్చింది. మైనారిటీ గురుకుల సొసైటీ కార్యదర్శిగా కొనసాగుతున్న ఆయేషా మస్రత్ ఖానంను బదిలీ చేసింది. ఆమెను సాధారణ పరిపాలనశాఖలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. మైనారిటీ గురుకులాల సొసైటీ కార్యదర్శిగా తఫ్సీర్ ఇక్బాల్, మైనారిటీ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా షేక్ యాస్మిన్ బాషాకు అదనపు బాధ్యతలు ఇచ్చింది. మైనారిటీ ఆర్థిక సంస్థ ఎండీగా నిర్మలా కాంతి వెస్లీకి అదనపు బాధ్యతలు ఇవ్వగా.. వక్ఫ్ బోర్డ్ సీఈవోగా మహ్మద్ అసదుల్లా నియామకమయ్యారు. రాష్ట్ర ఖనిజాభివృద్ధి సంస్థ ఎండీగా జీ మల్సూర్‌కు అదనపు బాధ్యతలు ఇవ్వగా.. ఖమ్మం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌గా పీ శ్రీజను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

# కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ అయ్యే అవకాశం

- ఎలాంటి ఆకస్మిక విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి
- ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి
- సీఎస్ శాంతికుమారి
- భారీ వర్షాల నేపథ్యంలో కలెక్టర్లతో సీఎస్ టెలీకాన్ఫరెన్స్




బలగం టీవీ, హైదరాబాద్

భారీ వర్షాల నేపథ్యంలో కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ అయ్యే అవకాశం ఉందని, ప్రాణ, ఆస్తి నష్టం కలుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సీఎస్ శాంతికుమారి కలెక్టర్లను ఆదేశించారు. వర్షాల నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలపై కలెక్టర్లతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. డీజీపీ జితేందర్, మున్సిపల్ పరిపాలన శాఖ ముఖ్య కార్యదర్శి దాన కిశోర్, ప్రణాళిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, నీటి పారుదలశాఖ కార్యదర్శి రాహుల్ బొజ్జా, వైద్య ఆరోగ్య శాఖ కార్యదర్శి క్రిస్టినా చోంగ్తు, పంచాయతీ రాజ్ శాఖ కార్యదర్శి లోకేశ్ కుమార్, ఫైర్ సర్వీసుల శాఖ డీజీ నాగిరెడ్డి, జీహెచ్ ఎంసీ కమీషనర్ ఆమ్రపాలి కాటా, మున్సిపల్ పరిపాలన విభాగం సంచాలకులు గౌతమ్ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలంగాణతో పాటు సరిహద్దుల్లోనూ భారీ వర్షాలు కురుస్తున్నాయన్నారు. ఎలాంటి ఆకస్మిక విపత్తునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ప్రతీ జిల్లా కలెక్టర్ కార్యాలయంతోపాటు జీహెచ్ఎంసీ, సచివాలయంలోనూ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. లోతట్టు, వరద ప్రజలు వెళ్లకుండా నిఘా వేయాలని చెప్పారు. ఉధృతంగా పారే వాగుల వద్ద ఒక అధికారిని ప్రత్యేకంగా నియమించి, పర్యవేక్షించాలని చెప్పారు. వర్షాల దృష్ట్యా జిల్లాల్లో పాఠశాలలకు సెలవు దినంగా ప్రకటించుకునే నిర్ణయం జిల్లా కలెక్టర్లు తీసుకోవాలని చెప్పారు. వరద ప్రభావం తీవ్రంగా ఉన్న ప్రాంతాల నుంచి ప్రజలను తరలించి పునరావాస శిబిరాలను ఏర్పాటు చేసే విషయంలో ముందస్తు ప్రణాళిక రూపొందించుకోవాలన్నారు. భారీ వర్షాలు, వరదలతోనే తీసుకునే జాగ్రత్తలపై ప్రజలను ఎప్పటికప్పుడు ప్రసార మాధ్యమాల ద్వారా చైతన్య పరచాలన్నారు. గ్రామాలు, పట్టణాలలోని మంచినీటి వనరులైన ట్యాంకులు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, అంటువ్యాధులు ప్రబలకుండా బ్లీచింగ్ పౌడర్, క్లోరినేషన్ చేపట్టాలని ఆదేశించారు.

వైద్య బృందాలను అప్రమత్తం చేశామని, అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో అవసరమైన మందులు సిద్ధంగా ఉంచామని చెప్పారు. ప్రస్తుతం ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందాలు హైదరాబాద్, విజయవాడలో ఉన్నాయని.. ఎలాంటి అవసరం ఉన్నా ముందస్తు సమాచారం ఇస్తే మిగితా 2వ పేజీలో

# కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనపై దృష్టి సారించాలి



- తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త రెవెన్యూ చట్టం
- మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్

కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనపై దృష్టి సారించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అభిప్రాయాలు, సలహాలు, సూచనలన్నింటినీ ఒకే దగ్గర పొదుపరిచి పరిశీలించాలన్నారు. ఇందులో రైతాంగానికి ఏది అవసరమో ఆ అంశాలను కొత్త చట్టంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. మారుతున్న కాలానికి, పరిస్థితులకు తగినట్లు భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకొని తెలంగాణ ప్రజల దశాబ్దాల ఆకాంక్షలకు అనుగుణంగా కొత్త రెవెన్యూ చట్టం తీసుకురాబోతున్నామన్నారు. రెవెన్యూ చట్టం లోపభూయిష్టంగా ఉండడంతో రైతులు, భూ యజమానులు కష్టాలుపడ్డారని.. ధరణితో భూ సమస్యలు పెరిగాయన్నారు. తప్పులు పునరావృతం కాకుండా ఉండేలా మేధావులు, నిపుణులు, రిటైర్డ్ రెవెన్యూ ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, రైతులు, సామాన్య ప్రజల నుంచి కూడా అభిప్రాయాలను స్వీకరించామన్నారు.

ముసాయిదాపై ఆగస్టు 2న శాసనసభలో చర్చించి అదేరోజు హైదరాబాద్‌లోని భూపరిపాలన ప్రధాన కార్యాలయంలో పబ్లిక్ డొమైన్‌లో పెట్టామన్నారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో వర్క్‌షాప్‌లు సైతం నిర్వహించడం జరిగిందన్నారు. జిల్లాస్థాయిలో నిర్వహించిన వర్క్‌షాప్‌లలో వచ్చిన సూచనలను ఒకే నివేదిక రూపంలో కలెక్టర్లు వెంటనే భూపరిపాలన కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా విస్తృత స్థాయిలో జరిపిన ప్రజాభిప్రాయ సేకరణలో పెద్ద ఎత్తున సూచనలు వచ్చాయన్నారు. లిఖిత పూర్వకంగా, ఈ-మెయిల్ ద్వారా సూచనలు వచ్చాయన్నారు. సామాన్యులు సైతం పలు సూచనలు చేశారని, అమలు చేసేవారికి అవగాహన ఉండేలా రైతులకు, సామాన్య ప్రజలకు అర్థమయ్యే రీతిలో అవినీతి రహితంగా చట్టాన్ని తీసుకురాబోతున్నామన్నారు.




## హర్యానా అసెంబ్లీ ఎన్నికలు వాయిదా

- అక్టోబర్ 5న పోలింగ్
- అక్టోబర్ 8న కౌంటింగ్

బలగం టీవీ, హైదరాబాద్

హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ తేదీని ఎన్నికల సంఘం (ఈసీ) వాయిదా వేసింది. ముందుగా ప్రకటించిన అక్టోబర్ 1కి బదులు అక్టోబర్ 5న పోలింగ్ నిర్వహించనున్నట్లు శనివారం తెలిపింది. జమ్ముకశ్మీర్, హర్యానా ఎన్నికల కౌంటింగ్, ఫలితాల తేదీని అక్టోబర్ 4 నుంచి అక్టోబర్ 8కు మార్పు చేసినట్లు వెల్లడించింది. ఈ మేరకు శనివారం ప్రకటన విడుదల చేసింది.

కాగా, శతాబ్దాల నాటి అసోజ్ అమావాస్య ఉత్సవాల్లో పాల్గొనేందుకు హర్యానాలోని బిష్ణోయ్ కమ్యూనిటీ ప్రజలు రాజస్థాన్‌కు భారీగా తరలివెళ్లడంపై జాతీయ, రాష్ట్రీయ రాజకీయ పార్టీలు, అఖిల భారత బిష్ణోయ్ మహాసభల నుంచి ఫిర్యాదులు అందినట్లు ఈసీ తెలిపింది. ఈ నేపథ్యంలో పెద్ద సంఖ్యలో ప్రజలు తమ ఓటు హక్కు వినియోగించు కోలేక పోవడం, హర్యానా అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ శాతంపై ప్రభావం చూపవచ్చన్న వాదనలతో హర్యానా ఎన్నికల పోలింగ్ తేదీతోపాటు కౌంటింగ్ తేదీని మార్పు చేసినట్లు పేర్కొంది

## విజయవాడలో నలుగురు మృతి..

● ఎక్స్‌గ్రేషియా ప్రకటన

బలగం టీవీ, అమరావతి

భారీ వర్షాలకు విజయవాడ మొగల్రాజపురంలో ఇళ్లపై కొండచరియలు విరిగిపడ్డాయి. ఈ ఘటనలో నలుగురు మృతి చెందారు. దీంతో సీఎం నారా చంద్రబాబు నాయుడు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. బండరాళ్లు విరిగి ఇళ్లపై పడిన ఘటనలో మేఘన, బోలెం లక్ష్మి, లాలు, అన్నపూర్ణ అనే నలుగురు ప్రాణాలు కోల్పోయారు. సహాయక చర్యలపై అధికారులతో సీఎం మాట్లాడారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.


ఈ మేరకు బాధిత కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు. కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉన్న చోట నుండి స్థానికులను సురక్షిత ప్రాంతాలకు తరలించే అంశంపై కసరత్తు చేయాలని అధికారులకు సీఎం సూచించారు. రెండు మూడు రోజులు భారీ వర్షాలు పడే అవకాశం ఉన్న నేపథ్యంలో అటు ప్రజలు, ఇటు అధికారులు అప్రమత్తంగా ఉండాలని సీఎం సూచించారు. అధికారుల సూచనలను ప్రజలు తప్పకపాటించాలని సీఎం కోరారు.

## రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలి

● తంగళ్లపల్లి పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

బలగం టీవీ,తంగళ్లపల్లి:

వర్షాకాలం నేపథ్యంలో దవాఖానల్లో రోగ నిర్ధారణ పరీక్షల సంఖ్య పెంచాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు.తంగళ్లపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పీ హెచ్ సీ ని కలెక్టర్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఓపీ సేవలు,ఫార్మసీ,వ్యాక్సిన్ గది,ఆసుపత్రి ఆవరణను పరిశీలించారు.ఫిజియో థెరపీ సేవల రిజిస్టర్ తనిఖీ చేశారు. రోజు ఓపీ ఎందరు వస్తున్నారో ఆరా తీశారు.అనంతరం మాట్లాడుతూ దవాఖాన ఆవరణ పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో రక్త పరీక్షలు ఎక్కువ సంఖ్యలో చేయాలని సూచించారు.సీసీ టీవీ



మరమ్మత్తు చేయించి వినియోగంలోకి తీసుకురావాలని ఆదేశించారు. ప్రతి ఒక్కరికీ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ స్నేహ,హోమియో డాక్టర్ డాక్టర్ దీప్తి,సిబ్బంది తదితరులు ఉన్నారు.

### శేష జీవితాన్ని
## కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలి



● ఎస్పీ అఖిల్ మహాజన్.

బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల

పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులు తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా గడపాలని ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు.శనివారం జిల్లా పోలీస్ కార్యాలయంలో 35సంవత్సరాలు సుదీర్ఘ కాలం పాటు విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన ఏఎస్ఐ చీటి సంజీవరావు ను ఎస్పీ అఖిల్ మహాజన్ శాలువా, పూలమాలతో సత్కరించి జ్ఞాపిక అందచేసి ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ.... సుదీర్ఘ కాలం పాటు పోలీసు వ్యవస్థను సేవలందించి పదవీ విరమణ పొందుతున్న ఏఎస్ఐ కి శుభాకాంక్షలు తెలియజేశారు.ప్రజలను పోలీసులు సక్రమంగా విధులను నిర్వర్తించడానికి కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఎంతగానో ఉంటుందని వారి తోడ్పాటు వల్లనే విధులను నిర్వర్తించి ఉన్నత స్థానాలకు ఎదగగలరని అన్నారు.పదవీ విరమణ పొందిన తర్వాత వచ్చే ప్రయోజనాలను త్వరగా అందించాలని సిబ్బందికి సూచించారు. పదవి విరమణ చేసిన మీరు ఇకపై కుటుంబ సభ్యులతో తమ శేష జీవితాన్ని ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా గడపాలని అన్నారు.ఎటువంటి అవసరం ఉన్న పోలీసు వ్యవస్థ ఎల్లవేళలా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,ఆర్ఐ యాదగిరి, ఎస్ఐ శ్రీకాంత్, సంజీవరావు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి



● ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

బలగం టీవీ , వేములవాడ

మిడ్ మానేర్ ముంపు గ్రామాల నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు.శనివారం మిడ్ మానేర్ ముంపు గ్రామాలు ఆరేపల్లి, సంకేపల్లి, రుద్రవరం, కొడుముంజ, అనుపురం, శభాష్ పల్లి, చింతల్ ఠాణా, చీర్లవంచ, గుర్రంవాణిపల్లి గ్రామాలకు చెందిన నిర్వాసితులతో చీర్లవంచలో సమావేశం నిర్వహించగా, ముఖ్య అతిథిగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల వారీగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ ఇండ్లకు పరిహారం, పట్టాలు, 18 ఏండ్లు నిండిన వారికి పరిహారం, ఆలయాలకు పరిహారం రాలేదని ఇతర సమస్యలను ప్రభుత్వ విప్, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. తమ గ్రామాలకు సరిహద్దులు చూపాలని, ఆక్రమణలు నిరోధించాలని, స్మశాన వాటికల వద్ద సమస్యలను పరిష్కరించాలని, పలువురు రియల్ ఎస్టేట్ నిర్వాహకులతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రభుత్వ విప్ దృష్టికి తీసుకువచ్చారు.ముంపు గ్రామాల పరిధిలో వెలసిన రియల్ ఎస్టేట్ వెంచర్ లకు అనుమతులు ఉన్నాయా, డీటీసీపీ అనుమతి ఉందా లేదా తెలుసుకోవాలని, ప్రభుత్వ భూములపై సర్వే చేసి నివేదిక ఇవ్వాలని రెవెన్యూ అధికారులను కలెక్టర్ ఆదేశించారు.

అనంతరం ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడాతూ మానవతా దృక్పథంతో అందరి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అర్హులందరికీ పరిహారం, మిగితా బెనిఫిట్స్ వచ్చేలా కృషి చేస్తానని అన్నారు.నోటిఫైడ్ కానీ వారి దరఖాస్తులపై మరోసారి అధికారులతో సర్వే చేయిస్తానని, అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తానని పేర్కొన్నారు. ఈ సమావేశంలో వేములవాడ ఆర్డీవో రాజేశ్వర్, ఎస్డీసీ రాధాబాయ్, డీఆర్డీఓ శేషాద్రి, వేములవాడ అర్బన్ తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఆడపిల్లలు రోడ్డెక్కితే స్పందించరా..?

(మొదటి పేజీ తరువాయి)

విద్యాశాఖ, , సోషల్ వెల్ఫేర్ కూడా రేవంత్ దగ్గరే ఉందని అంటూ, మీ శాఖలోనే ఈ రకంగా జరుగుతున్నాయన్నారు. హాస్టల్ విద్యార్థులకు అందాల్సిన కాస్మోటిక్ ఛార్జిలు అందడం లేదు. మెస్ బిల్లులు విడుదల చేయడం లేదు. పిల్లలకు పురుగులతో కూడిన అన్నం పెడుతున్నారు. నీవు పూర్తిగా విఫలం అయ్యావు. మాటలు కాదు.. యాక్షన్‌లో చేసి చూపించు. పిల్లల గురించి ఆలోచించు అని అన్నారు.

ఈ ప్రభుత్వంలో కస్తూర్బా విద్యాలయాలతో పాటు ఇతర గురుకులాలను నిర్లక్ష్యం చేస్తున్నారు. విషాహారం తిని పిల్లలు ఆస్పత్రుల పాలవుతున్నారు. ఇప్పటి వరకు 500 మంది దాకా ఆస్పత్రి పాలయ్యారు. 38 మంది చనిపోయారు. ఒక వైపు పాము కాట్లు, మరో వైపు ఎలుకలు కొరుకుతున్నాయి. అయినా ప్రభుత్వం మొద్దు నిద్ర పోతోంది. రామాయంపేట ఎస్సీ గురకులంలో 11 మంది, నల్లగొండ బీసీ గురుకులంలో 13 మంది విద్యార్థులను ఎలుకలు కొరకడంతో వారు ఆస్పత్రి పాలయ్యారు. ఒకప్పుడు తెలంగాణ గురుకులాలు దేశానికి ఆదర్శంగా ఉండేవి. ఇవాళ తల్లిదండ్రులు కూడా కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. కులం పేరుతో దూషిస్తున్నారని పిల్లలు చెబుతున్నారు. ఇప్పటికైనా రివ్యూ చేయండి.. టీచర్లందరిని మార్చండి. నాణ్యమైన భోజనం పెట్టండని రాష్ట్ర ప్రభుత్వానికి హరీశ్‌రావు సూచించారు.

## కొన్ని ప్రాంతాల్లో క్లౌడ్ బరస్ట్ అయ్యే అవకాశం

(మొదటి పేజీ తరువాయి)

పంపిస్తామన్నారు.

గోదావరి, కృష్ణా నదుల పరీవాహక ప్రాంతాల్లోని జిల్లాల కలెక్టర్లు మరింత అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. భారీ వరదలు, వర్షాలతో కొన్ని చోట్ల చెరువులకు స్థానికులు గండ్లు పెట్టే అవకాశం ఉందని, దాంతో లోతట్టు ప్రాంతాలు ముంపుకు గురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు. అలాంటి చర్యలకు పాల్పకుండా నీటిపారుదల శాఖ అధికారులచే పర్యవేక్షించాలని సూచించారు. పోలీస్, నీటిపారుదల శాఖ, విపత్తుల నిర్వహణశాఖ, పంచాయతీ రాజ్‌శాఖలు సమన్వయంతో పని చేయాలన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలను అప్రమత్తం చేయడంతో పాటు మ్యాన్‌హోల్స్‌ను తెరవకుండా నిఘా వేయాలన్నారు.

# తెలుగు రాష్ట్రాల్లో భారీ వర్షాలు..



(మొదటి పేజీ తరువాయి)

అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఈ మేరకు రాష్ట్రానికి రెడ్ అలర్ట్ జారీ చేశారు. ముఖ్యంగా నల్లగొండ, నాగర్ కర్నూల్, వనపర్తి, జోగులాంబ గద్వాల్, నారాయణ పేట జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయని చెప్పారు. అలాగే, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాలో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసే అవకాశం ఉందన్నారు. శనివారం ములుగు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయన్నారు. తెలంగాణలో గంటకు 30-40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉందన్నారు. కాగా, ఇప్పటి వరకు నారాయణపేటలో అత్యధికంగా 13 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

**రెడ్ అలర్ట్ ప్రకటించిన జిల్లాలివే..**

కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్త గూడెం, ఖమ్మం, నల్గొండ జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది హైదరాబాద్ వాతా వరణ కేంద్రం. ఇక ఆదిలాబాద్, కొమరం భీం అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సూర్యాపెట, మహబూబ్‌నగర్, వరంగల్, హన్మకొండ, సిద్దిపేట, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, నగర్ కర్నూల్ జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది.

ఆసిఫాబాద్, మంచిర్యాల, జగిత్యాల, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్, హన్మకొండ, జనగాం, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను ప్రకటించింది. శనివారం ఉదయం నుంచి తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో భారీ వర్షాపాతం నమోదైంది. కామారెడ్డి, ఖమ్మం, వరంగల్, భువనగిరి, నల్గొండ జిల్లాల్లో విస్తారంగా వర్షాలు కురిశాయి. కామారెడ్డి జిల్లా బోమన్‌దేవిపల్లిలో 13.7 సెంటీమీటర్లు, ఖమ్మం జిల్లా ఎర్రుపాలెం 12.7 సెంటీమీటర్ల వర్షం కురిసిందని టీఎస్‌డీపీఎస్ వివరించింది.

- సూర్యాపేట జిల్లా హుజూర్నగర్ మండల కేంద్రంలో కుండపోత వర్షం
- 28.73 సెంటీమీటర్ల వర్షపాతం నమోదు
- ఈ ఏడాది ఇప్పటివరకు ఒక ప్రాంతంలో ఒక రోజులో పడ్డ వర్షపాతం ఇదే అత్యధికం
- సూర్యాపేట, ఖమ్మం, ములుగు జిల్లాల్లో అత్యంత భారీ వర్షం
- 120 ప్రాంతాల్లో భారీ వర్షం
- 1016 రెయిన్ గేజ్ సెంటర్లలో వర్షపాతం నమోదు
- రాష్ట్రవ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం

## గణేష్ మండపాల వద్ద జాగ్రత్తలు తీసుకోండి



(మొదటి పేజీ తరువాయి)

చెల్లిస్తానని పేర్కొన్నారు. 24 గంటలు విద్యుత్ సరఫరా చేయాలని, మండపాల్లో నిర్వాహకులు తప్పనిసరిగా ఉండాలని కోరారు. సంస్కృతిని పండుగను కాపాడుకునే బాధ్యత ప్రతి ఒక్కరిపైన ఉందని తెలిపారు.

జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ పోటీగా కాకుండా భక్తితో భగవంతున్ని పూజించాలని కోరారు. మట్టి గణపతిలను ప్రతిష్టించేందుకు ప్రాధాన్యత ఇవ్వాలని, ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. ఉత్సవాలకు కావలసిన అన్ని ఏర్పాట్లు సకాలంలో పూర్తి చేయాలని వివిధ శాఖల అధికారులను ఆదేశించారు. గ్రీన్ గణేశా విగ్రహలను ప్రోత్సహించాలన్నారు. పీఓపీ విగ్రహాలతో ఎన్నో అనర్థాలు ఉన్నాయని, ప్రజల్లో అవగాహన కల్పించి, చైతన్యం తేవాలన్నారు. పోలీస్ కమిషనర్ అభిషేక్ మహంతి నిర్వాహకులు ముందుగా పోలీసు అనుమతి తీసుకోవాలన్నారు.

రోడ్డుకు అంతరాయం లేకుండా విగ్రహాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. శబ్ద కాలుష్యం ఉపయోగించకూడదన్నారు. రాత్రి వేళ మండపాల వద్ద కమిటీ సభ్యులు కాపలా ఉండాలన్నారు. నిమజ్జనానికి సంబంధించిన రూటు మ్యాప్‌ను ముందే తెలియజేయాలన్నారు. ఊరేగింపుల్లో బాణసంచా ఉపయోగించరాదని, డీజే శబ్దాలు, అశ్లీల డ్యాన్సులు నిరోధించాలన్నారు. ట్రాఫిక్‌కు అంతరాయం కల్గించకూడదన్నారు. పోలీస్ శాఖ సూచనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. పెద్ద విగ్రహాలు ఏర్పాటు చేసే మండపాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చాహత్ బాజ్ పేయి, అడిషనల్ కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, గణేష్ మండపాల నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ముందుగా పోలీస్ అధికారులు వినాయక చవితి ఏర్పాట్లపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు.

## 1,864 స్కూళ్ల మూసివేతకు కుట్ర..

(మొదటి పేజీ తరువాయి)

వసతి గృహాల్లో సన్న బియ్యంతో భోజనం పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియాన్ని ప్రవేశ పెట్టి ప్రైవేట్ స్కూళ్లకు ధీటుగా విద్యా భోధన చేపట్టేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అంతే కాకుండా మన ఊరు- మన బడి పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన విద్యను అందిచేందుకు దాదాపు రూ. 7,289 కోట్ల రూపాయలను కేటాయించిన విషయాన్ని గుర్తు చేశారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ బులిటీ (సీఎస్ఆర్) ఫండ్స్ ద్వారా కూడా పాఠశాలకు పక్కా బిల్డింగ్‌లను ఏర్పాటు చేశామన్నారు. ప్రభుత్వ విద్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు వ్యవస్థగతంగా తీసుకోవాల్సిన అన్ని చర్యలపై కేసీఆర్ ప్రత్యేక దృష్టి పెట్టారన్నారు. స్కూళ్లలో డ్రాపౌట్స్‌ను నివారించేందుకు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా తెచ్చామన్నారు. ఫలితంగానే గతంలో ఎప్పుడూ లేని విధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాల కోసం పోటీ పడే పరిస్థితి వచ్చిందన్నారు.

కేసీఆర్ వేసిన బాటను మరింత పటిష్టం చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆ సోయి లేకుండా ప్రవర్తిస్తోందన్నారు. స్కూళ్లలో విద్యార్థుల ప్రవేశాలు తగ్గి పోవటానికి కారణాలను అన్వేషించి వాటి నివారణపై దృష్టి పెట్టకుండా స్కూళ్లను మూసివేయటమేమిటనీ ప్రశ్నించారు. అంటే పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువు కోవటం రేవంత్ రెడ్డి సర్కార్‌కు ఇష్టం లేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యలను సృష్టించి తద్వారా విద్యార్థులు లేరంటూ స్కూళ్లను మూసివేయాలని భావిస్తున్నారా అని కేటీఆర్ నిలదీశారు. అత్యంత ప్రాధాన్యమైన ఈ అంశాన్ని ఇంత నిర్లక్ష్యం చేస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు.

అసలు విద్యా వ్యవస్థలో ఏం జరుగుతుందో ఈ ముఖ్యమంత్రికి తెలుసా అని కేటీఆర్ ప్రశ్నించారు. రాష్ట్రానికి విద్యా శాఖ మంత్రి లేడు. ముఖ్యమంత్రికి విద్యా వ్యవస్థపై పట్టింపు లేదు. అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ సీఎంకు రాజకీయాలు, డైవర్షన్ టాక్టిక్స్ తప్ప ప్రజల సమస్యలపై సోయి ఉందా అని కేటీఆర్ అన్నారు. ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఈ అంశంపై దృష్టి పెట్టాలని కేటీఆర్ సూచించారు. వెంటనే విద్యాశాఖకు మంత్రిని నియమించి సమస్యల పరిష్కరానికి కృషి చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గటానికి కారణాలు, ప్రభుత్వ విద్య ను బలోపేతం చేయటానికి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు చేసేందుకు విద్యావేత్తలు, మంత్రులతో కూడిన కమిటీ వేయాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

ప్రభుత్వం వెంటనే విద్యారంగ సమస్యలపై దృష్టి సారించకపోతే బీఆర్ఎస్ పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతుందని హెచ్చరించారు. పేద, మధ్య తరగతి విద్యార్థులకు ప్రభుత్వ విద్యను దూరం చేస్తామంటే ఎట్టిపరిస్థితుల్లో సహించేది లేదన్నారు. ప్రభుత్వం అందించే విద్య పైనే ఆధారపడిన నిరుపేద లక్షలాది విద్యార్థుల తల్లితండ్రులకు అన్యాయం చేస్తామంటే వారే ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని కేటీఆర్ అన్నారు.

### రేపు స్కూళ్లకు సెలవు

బలగం టీవీ , హైదరాబాద్

తెలంగాణవ్యాప్తంగా రాగల రెండురోజు సైతం అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దాంతో హైదరాబాద్ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలకు సోమవారం సెలవు ప్రకటించారు. ఈ మేరకు విద్యాశాఖకు హైదరాబాద్ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

## గబ్బర్ సింగ్ అంటే ఒక చరిత్ర



బలగం టీవీ , హైదరాబాద్

పవన్ కళ్యాణ్ హరీశ్ శంకం కాంబోలో వచ్చిన గబ్బర్‌సింగ్ చిత్రం 2012లో విడుదలై పవన్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా నిలిచి కలెక్షన్ల వర్షం కురిపించింది. అయితే ఈ చిత్రం పవన్ కళ్యాణ్ బర్త్‌డే సందర్భంగా మళ్లీ రీ రిలీజ్ చేస్తున్నారు మేకర్స్. పవన్ పుట్టినరోజు సందర్భంగా సెప్టెంబర్ 2న 'గబ్బర్ సింగ్' రీరిలీజ్ కానుంది.

ఈ సందర్భంగా ప్రెస్ మీట్ నిర్వహించగా.. దర్శకుడు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడాడు. ఈ వేడుకకు చిత్ర నిర్మాత బండ్ల గణేష్ హీరో. అందుకే అతడిని చివరిగా మట్లాడామని చెప్పాను. సోషల్ మీడియా, ఇంటర్‌నెట్, డిజిటల్ రెవల్యూషన్ వచ్చిన తర్వాత ఈ సినిమా వచ్చి ఉంటే ఇంకా పెద్ద హిట్టు అయ్యేది. ఎందుకంటే ఇప్పుడు ఏ సినిమా చూసిన పాన్ ఇండియా లెవల్లో దూసుకుపోతుంది. అందుకే ఆ వెలితి కనిపించేది. అయితే ఆ వెలితి ఇప్పుడు రీ రిలీజ్‌తో తీరనుంది. నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చిన ఈ టీమ్‌కు ధన్యవాదాలు. 'గబ్బర్ సింగ్' చరిత్రలో ఉండిపోయే సినిమా కాదు. 'గబ్బర్ సింగ్' అంటేనే ఒక చరిత్ర. ఈ విషయంలో ఎటువంటి సందేహం లేదు. ఈ సినిమా నాతో పాటు నిర్మాత బండ్ల గణేష్ జీవితాలను మార్చేసింది. ఈ సినిమా తీస్తున్నప్పుడు ఇంత పెద్ద హిట్ అవుతుంది అనుకోలేదు. కానీ మేము ఊహించిన దానికంటే ఈ సినిమా భారీ విజయం సాధించింది. సోషల్ మీడియాలో ఒక డైలాగ్ ఉంటుంది. బాగుంటే సూపర్ హిట్ అంటారు. సూపర్ హిట్ అని టాక్ వస్తే.. అది బ్లాక్ బస్టర్ అని.. అదే బ్లాక్ బస్టర్‌ను మించి ఉంటే అది గబ్బర్ సింగ్ అవుతుందని హరీశ్ చెప్పుకొచ్చాడు. ఈ సినిమా ఫస్ట్ క్రిటిక్ పవన్‌కల్యాణ్. డబ్బింగ్ సమయంలోనే ఆయన ఇది పక్కా బ్లాక్‌బస్టర్ అన్నారు. ఇది ఎవర్‌గ్రీన్ మూవీ అంటూ హరీశ్ తెలిపాడు.

నిర్మాత బండ్ల గణేష్ మాట్లాడుతూ గబ్బర్ సింగ్ సినిమా విషయానికి వస్తే. తన తల్లి తండ్రులు తనకు జన్మనిస్తే పవన్ కళ్యాణ్ తనకు బతుకునిచ్చాడన్నారు. ఆయన గురించి ఎంత చెప్పుకున్న తక్కువే. నేను ఆర్థికంగా ఏ స్థాయిలో ఉన్నా కానీ.. పవన్ లేకపోతే నాకు ఈ పేరు కానీ ఈ హోదా కానీ ఉండేది కాదు. పవన్ కళ్యాణ్ లేకపోతే నేను చిన్న చిన్న పాత్రలు వేసుకుంటూ మిగిలిపోయేవాడిని. పవన్ కళ్యాణ్ ఒకరోజు నన్ను పిలిచి గణేష్ నువ్వు నిర్మాతగా చెస్తావా అని అడిగాడు. అందరూ నువ్వు నిర్మాత ఏంటయ్యా అంటుంటే పవన్ నాకు అండగా నిలిచాడు. గబ్బర్ సింగ్ ఒక చరిత్ర.

హిందువులకు భగవద్గీత, ముస్లిమ్స్ కి ఖురాన్, క్రైస్తవులకు బైబిల్ ఎంత పవిత్రమో పవన్ ఫ్యాన్స్ కి కూడా గబ్బర్ సింగ్ అంతా పవిత్రమైనది అది ఎప్పటికి మారదు. ఈ సినిమా క్రెడిట్‌కు సంబంధించి.. సినిమాలోని ప్రతి అడుగు, ప్రతి మాటా, ప్రతి కష్టం అంతా హరీశ్ శంకర్‌కే దక్కుతుంది. పవన్‌తో ఇంతకుముందు తీన్మార్ సినిమా చేశాను. ఆయన దర్శకుడు ఏం చెబితే అదే చేస్తాడు. కానీ హరీశ్ శంకర్ అలా కాదు. హరీష్ శంకర్ ని సరిగ్గా వాడుకోవట్లేదు అని పవన్ హరీష్ కి ఫుల్ ఫ్రీడమ్ ఇచ్చి నటించారు. పవన్ కళ్యాణ్ అత్యధిక రెమ్యునరేషన్ తీసుకుంటూ హ్యాపీగా బతకగలిగినా అవన్నీ వదిలేసి పదేళ్లు పోరాడి పోరాడి ఇవాళ ఒక స్థాయిలో ఉన్నారు. ఇప్పుడు తెలుగు సినిమాలు, దర్శకులు, నిర్మాతలు దేశ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంటున్నారు. ఇలాంటి సమయంలో నేను ఏడేళ్ల నుంచి సినిమాలకు దూరంగా ఉన్నాను. మళ్లీ సినిమాల్లోకి వచ్చి మళ్లీ సినిమాలు తీస్తాను. పరమేశ్వర ఆర్ట్స్ అంటే మళ్లీ సూపర్ హిట్ సినిమాలు తీసేలా చేస్తాను. అంటూ బండ్ల గణేష్ చెప్పుకొచ్చాడు.

## మహిళలపై అఘాయిత్యాల కేసుల్లో సత్వర న్యాయం జరగాలి



● ప్రధాని మోడీ

బలగం టీవీ , న్యూఢిల్లీ

దేశంలోనిమహిళలపై అఘాయిత్యాల కేసుల్లో ఎంత వేగంగా న్యాయం జరుగుతుందో.. అప్పుడే వారి భద్రతపై ఎక్కువ భరోసా ఏర్పడుతుందని ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ అన్నారు. భారత ప్రధాన న్యాయమూర్తి డీవై చంద్రచూడ్ సమక్షంలో జరిగిన జిల్లా న్యాయవ్యవస్థ జాతీయ సదస్సు ప్రారంభ సెషన్‌లో ప్రధాని పాల్గొని మాట్లాడారు. న్యాయవ్యవస్థలపై ప్రజలు ఎన్నడూ అపనమ్మకం చూపలేదన్నారు. ఇక ఇదే సదస్సులో దేశంలో మహిళలు, చిన్నారులపై జరుగుతున్న అఘాయిత్యాల గురించి ప్రస్తావించారు.'దేశంలో మహిళలకు భద్రత కల్పించేందుకు ఇప్పటికే అనేక కఠినమైన చట్టాలు ఉన్నాయి. ఇలాంటి కేసుల్లో వేగంగా విచారణ పూర్తి చేసి శిక్షలు విధించాలి. 2019లో ఫాస్ట్‌ట్రాక్ కోర్టు చట్టాన్ని తీసుకొచ్చాం. ఈ చట్టం కింద సాక్షులను రక్షించే కేంద్రాలను ఏర్పాటు చేశాం. జిల్లా పర్యవేక్షక బృందాలు కీలక పాత్ర పోషిస్తున్నాయి. వీటిని మరింత బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అప్పుడే మహిళలపై నేరాల విషయంలో వేగంగా తీర్పులు వెలువడతాయి' అని ప్రధాని అన్నారు.

ఈ కార్యక్రమంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ ప్రసంగిస్తూ.. న్యాయం కోసం సామాన్యుడు ఆశ్రయించే తొలి గమ్య స్థానం జిల్లా న్యాయవ్యవస్థ అని తెలిపారు. మొత్తంగా న్యాయ వ్యవస్థకు ఇది వెన్నుముక వంటిదన్నారు. జిల్లా న్యాయ వ్యవస్థను సబార్డినేట్ న్యాయ వ్యవస్థగా పిలవడం మానం మానాలన్నారు. స్వాతంత్ర్యం లభించిన 75 ఏళ్ల తర్వాత బ్రిటీష్ కాలం నాటి ఒక అవశేషాన్ని మనం వదిలించుకోవాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. అదే 'వలసవాద లొంగుబాటు ధోరణి' అని చీఫ్‌జస్టిస్ చెప్పారు. జిల్లా న్యాయవ్యవ్థలో మరింత మంది మహిళలు చేరుతున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. కేరళలో తాజా రిక్రూట్‌మెంట్‌లో మొత్తం జ్యుడీషియల్ అధికారుల్లో 72 శాతం మహిళలేనని అన్నారు.

సుప్రీం కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు, సీనియర్‌న్యాయవాది కపిల్ సిబల్ మాట్లాడుతూ ట్రయల్ కోర్టులు, జిల్లా కోర్టులు కొన్ని కేసుల్లో బెయిల్ మంజూరు చేయడానికి ఇష్టపడవని, ఇది ఇందులోని అనారోగ్య లక్షణమని అన్నారు. బెయిల్ అనేది రూల్ అని దాన్ని ఇవ్వకుండా ఆపడానికి వీల్లేదని ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును ఆయన ప్రస్తావించారు. ఎలాంటి పక్షపాతం లేకుండా, భయం లేకుండా త్వరితగతిన న్యాయం అందించేలా మన ట్రయల్ కోర్టులకు, జిల్లా,సెషన్స్ కోర్టులకు సాధికారత కల్పించాల్సిన అవసరం వుందని అన్నారు. ఈ స్థాయిలో న్యాయవ్యవస్థ ప్రజల మనస్సుల్లో విశ్వాసం నెలకొల్పుతుందన్నారరు. న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్, సుప్రీం కోర్టు, హైకోర్టు న్యాయమూర్తులు, జ్యుడీషియల్ అధికారులు, ఇంకా పలువురు ప్రముఖులుఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# మ్యాథ్స్ చేయించి.. ఇంగ్లీష్ చదివించిన కలెక్టర్

- స్వచ్ఛత.. పరిశుభ్రత పాటించాలి
- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా..



**బలగం టీవీ , సిరిసిల్ల**

వర్షాకాలం సీజన్ దృష్ట్యా వసతి గృహాల్లో స్వచ్ఛత.. పరిశుభ్రత పాటించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. శుక్రవారం చందుర్తి మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హాస్టల్ లోని స్టోర్ రూం, టాయిలెట్స్, కిచెన్, గదులు, రిజిస్టర్లు పరిశీలించారు. మొత్తం ఎంత మంది విద్యార్థులు ఉన్నారని డీఎస్ సీడీఓ విజయ లక్ష్మిని అడుగగా, 35 మంది విద్యార్థులు ఉన్నారని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఉదయం ఏమి టిఫిన్ పెట్టారని తెలుసుకోగా, అటుకులు, సేమియా ఇచ్చామని చెప్పారు. సీజనల్ వ్యాధులు పొంచి ఉన్న నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

**మ్యాథ్స్ చేయించి.. ఇంగ్లీష్ చదివించి..**

అనంతరం కలెక్టర్ సందీప్ కుమార్ ఝా చందుర్తి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తరగతి గదిలో విద్యార్థులతో మ్యాథ్స్ సమస్యలను పరిష్కరింపజేసి,ఇంగ్లీష్ లెసన్స్ చదివించారు. పిల్లలు రాయడం, చదవడం, సమస్యల పరిష్కారంలో ముందు ఉండేలా చూసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. అదే ఆవరణలోని అంగన్వాడి కేంద్రాన్ని తనిఖీ చేసి, విద్యార్థులకు సిద్ధం చేస్తున్న ఆహార పదార్థాలను పరిశీలించారు. ఈ కార్యక్రమం లో డీఈఓ రమేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు పోక్సో పై అవగాహన సదస్సు



**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

తంగళ్ళపల్లి మండలంలోని మండెపల్లి ఆదర్శ పాఠశాలలో బాలికల పై జరుగుతున్న లైంగిక వేధింపుల నివారణ కార్యక్రమంలో భాగంగా సఖి అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఇందులో సఖి అందిస్తున్న సేవలు ఉద్దేశం గురించి తెలియజేస్తూ వరకట్నం గృహ హింస లైంగిక వేధింపులు పనిచేసే చోట లైంగిక వేధింపులు స్త్రీల బాలికల అక్రమ రవాణా అమ్మకాల మహిళలకు పిల్లలకు ఉన్న టోల్ ఫ్రీ నెంబర్స్ 181 1098 పోలీస్ హెల్ప్ లైన్ నెంబర్ 100 పోక్సో చట్టం బాలల హక్కులు పట్ల అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సఖి సెంటర్ కౌన్సిలర్ అంజలి,తంగళ్ళపల్లి ఎస్సై దాస సుధాకర్,ప్రిన్సిపల్ రమేష్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## అధిక వడ్డీ రేట్లతో
# సామాన్యుల పై దౌర్జన్యం చేస్తే చర్యలు తప్పవు



- ఎస్పీ అఖిల్ మహాజన్..
- డైలీ ఫైనాన్స్ వ్యాపారస్తులపై పోలీసుల కొరడా.
- జిల్లా వ్యాప్తంగా ఏకకాలంలో దాడులు.

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

చట్ట విరుద్ధంగా అధిక వడ్డీ రేట్లతో సామాన్యుల పై దౌర్జన్యం చేస్తే చర్యలు తప్పవు అని ఎస్పీ అఖిల్ మహాజన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడుతూ జిల్లాలో అనుమతులు లేకుండా డైలీ ఫైనాన్స్ నిర్వహిస్తున్న, డైలీ ఫైనాన్స్ వ్యాపారస్తులు పై శుక్రవారం ఏకకాలంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించామని అన్నారు.

ప్రజల ఆర్థిక అవసరాలను ఆసరాగా చేసుకొని వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి నుండి అధిక వడ్డీ వసూలు చేస్తూ, అట్టి అధిక వడ్డీలు చెల్లించలేక ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని,చట్ట విరుద్ధంగా,అధిక వడ్డీ రేట్లతో సామాన్యుల పై దౌర్జన్యం చేస్తే ఎంతటివారైనా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రజలు ప్రభుత్వ అనుమతితో చట్టపరమైన పద్ధతులలో ఫైనాన్స్ నిర్వహించే వారిని మాత్రమే నమ్మాలి అని అన్నారు.ఎటువంటి ప్రభుత్వ అనుమతి లేకపోయిన అక్రమ ఫైనాన్సు వ్యాపారం నడిపేవారి వివరాలు జిల్లా పోలీస్ కార్యాలయంలో తనకు సమాచారం ఇవ్వొచ్చు అని, అలాగే స్థానిక పోలీసు వారికి ,డయల్100 కు పిర్యాదు చేయాలని అన్నారు .సమాచారం ఇచ్చిన వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు సమగ్ర విచారణ చేసి బాధితులకు న్యాయం చేయడం లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని అన్నారు.

# 30వ తేదీ లోగా సీఎంఆర్ ఇవ్వాలి..



- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్..

**బలగం టీవీ ,ముస్తాబాద్**

రైస్ మిల్లర్లు 2023-24 సీజన్ ఖరీఫ్ సీఎంఆర్ సెప్టెంబర్ 30వ తేదీ లోగా ఇవ్వాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు.శుక్రవారం ముస్తాబాద్ లోని తిరుమల, శ్రీనివాస, నామాపూర్లోని ధన లక్ష్మి, సప్తగిరి, పోత్గల్ లోని బాలాజీ రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. రైస్ మిల్లుల్లో మిల్లింగ్, బియ్యం నాణ్యతను పరిశీలించారు. సీఎంఆర్ లక్ష్యం ఎక్కడి వరకు పూర్తి చేశారో అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ అన్ని రైస్ మిల్లులకు అప్పగించిన ధాన్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో వచ్చే నెల 30 వ తేదీలోగా ఇవ్వాలని,డేట్ మళ్ళీ పొడగించే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. ఈ మేరకు అన్ని ఏర్పాట్లు చేసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి, జిల్లా పౌర సరఫరాల మేనేజర్ రజిత తదితరులు ఉన్నారు.

**రిజిస్ట్రేషన్లు వేగంగా పూర్తి చేయాలి..**

తహసిల్దార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. ముస్తాబాద్ తహసిల్దార్ కార్యాలయాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, రిజిస్ట్రేషన్ల ప్రక్రియ, ఆఫీస్ ఆవరణ పరిశీలించారు. కార్యాలయాన్ని శుభ్రంగా ఉండేలా చూసుకోవాలని తహసీల్దార్ సురేష్ కు సూచించారు. మీ సేవా దరఖాస్తులు, ధరణి పెండింగ్ అప్లికేషన్స్ త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

**కేజీబీవీ విద్యాలయం తనిఖీ..**

ముస్తాబాద్ మండల కేంద్రంలోని కేజీబీవీ విద్యాలయాన్ని అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహార పదార్థాలు నాణ్యత ఎలా ఉందో చూసి విద్యార్థులతో మాట్లాడారు. ఆఫీస్ రూమ్ లో రిజిస్టర్లు, స్టోర్ రూమ్ లో నిల్వచేసిన బియ్యం, ఆహార పదార్థాల తయారీ వినియోగించే వస్తువులను పరిశీలించారు.

# విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దిన టీచర్ సంపత్ కుమార్

- మిషన్- 100 పేరిట ప్రత్యేక కార్యక్రమం...
- జాతీయ పురస్కారానికి ఎంపికైన ఉత్తమ టీచర్‌కు కలెక్టర్ అభినందన..
- రాష్ట్రం నుంచి ఇద్దరు ఎంపిక కాగా, వారిలో ఒకరు రాజన్న జిల్లా టీచర్



**బలగం టీవీ , సిరిసిల్ల**

మిషన్ 100 అనే కార్యక్రమాన్ని చేపట్టి, విద్యార్థులే సొంతంగా వివిధ ఆవిష్కరణలు రూపొందించేలా తీర్చిదిద్దుతు, ఎందరో విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందేలా సిద్ధం చేసిన జిల్లా టీచర్ కి అత్యున్నత పురస్కారం దక్కనుంది. జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి రాష్ట్రం నుంచి ఇద్దరు ఉపాధ్యాయులు ఎంపిక కాగా అందులో ఒకరు రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేట మండలం దమ్మన్నపేట జడ్పిహెచ్ఎస్ హైస్కూల్ భౌతిక శాస్త్ర టీచర్ తాడూరి సంపత్ కుమార్ ప్రతిష్టాత్మక రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యారు.

విద్యార్థుల్లో సృజనాత్మక ఆలోచనలు వెలికి తీసి, వారు ఆవిష్కరణలు చేసేలా ప్రోత్సహించి ప్రధానమంత్రి, రాష్ట్రపతి చేతుల మీదుగా అవార్డులు అందుకోవడంలో అవిశ్రాంతంగా కృషి చేస్తున్న జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారానికి ఎంపికైన భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు తాడూరి సంపత్ కుమార్ ను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు.

**మిషన్- 100 పేరిట ప్రత్యేక కార్యక్రమం..**

100 మంది గ్రామీణ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను ఆవిష్కర్తలుగా చేయాలనే సదుద్దేశంతో మిషన్- 100 కార్యక్రమాన్ని సంపత్ కుమార్ ప్రారంభించారు. ఇప్పటి వరకు 53 మంది విద్యార్థులను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దడంతో పాటు, అందులోని 8 మంది విద్యార్థులు అంతర్జాతీయ స్థాయి, 16 మంది జాతీయస్థాయి బహుమతులు గెలుచుకున్నారు.

**ఇవీ ఆవిష్కరణలు..**

సంపత్ కుమార్ సారథ్యంలో విద్యార్థులు గైడ్ వెల్డర్లు కు ఉపయోగపడే హెల్మెట్ ఆవిష్కరించి, జపాన్ దేశంలో నిర్వహించిన అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైనందున రాష్ట్రపతి, ప్రధానమంత్రి అభినందించారు. ఇద్దరు విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు 2021, 2023 నందు హై రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ లో చోటు దక్కించుకున్నాయి. సంపత్ కుమార్ గైడ్ చేసిన ఆవిష్కరణలు వరుసగా నాలుగు సార్లు జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ కు ఎంపికయ్యాయి. వీరి మార్గదర్శనం లో విద్యార్థులు చేసిన ఆవిష్కరణలు ఇండియా లో నిర్వహించే అన్ని వైజ్ఞానిక ప్రదర్శనల్లో జాతీయ స్థాయికి ఎంపికవడము విశేషం. విద్యార్థుల కొరకు అవిశ్రాంతంగా శ్రమిస్తున్న వీరి సేవలను గుర్తించి భారత ప్రభుత్వం వీరికి జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని రాష్ట్రపతి చేతులమీదుగా సెప్టెంబర్ 5వ తేదీన అందజేయనున్నారు.

కలెక్టర్ ను కలిసిన వారిలో జిల్లా విద్యాధికారి ఎ. రమేష్ కుమార్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్ రావు, జిల్లా సైన్స్ అధికారి దేవయ్య పాల్గొన్నారు..

**ప్రతి టీచర్ విద్యార్థి సర్వతో ముఖాభివృద్ధికి అంకితభావంతో పనిచేయాలి : కలెక్టర్ సందీప్ కుమార్ ఝా**


ప్రతిఉపాధ్యాయుడు పాఠశాల సమయంలోనే కాకుండా అదనపు సమయంలో కూడా ప్రత్యేక తరగతులను నిర్వహిస్తూ పిల్లల్లో భాష, గణిత నైపుణ్యాలను పెంపొందించేలా కృషి చేయాలని, ప్రభుత్వం కేటాయించిన సెలవులను వీలైనంత తక్కువగా వినియోగించుకోని విద్యార్థుల సర్వతో ముఖాభివృద్ధికి అకింతభావంతో పనిచేయాలనిఅన్నారు.

# బాలపురస్కార్-2024 అవార్డులకు దరఖాస్తుల ఆహ్వానం

**బలగం టీవీ , సిరిసిల్ల**

జిల్లాలోని ప్రతిభావంతులైన పిల్లలను సత్కరించేందుకు భారత ప్రభుత్వం ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్-2024 అవార్డులను అందజేయుటకు దరఖాస్తులను స్వీకరిస్తున్నదని జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజాం శుక్రవారం ఒ ప్రకటన లో తెలిపారు. ఈ సందర్భంగాజిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజాం మాట్లాడుతూ ఇట్టి అవార్డులను నిస్వార్థమైన సేవలు చేసిన యువ బాలబాలికలుకు వ్యక్తిగత హోదాలో బాలబాలికల అభ్యున్నతికి కృషి చేసిన మరియు సంస్థలకు ఇవ్వబడునని అన్నారు. ఇట్టి దరఖాస్తులకు 5వ నుండి 18వ సంవత్సరముల వయస్సు లోపుగల బాలబాలికలు అర్హులని అన్నారు. ధైర్యసాహసాలు, క్రీడలు, సామాజిక సేవ, సైన్స్ అండ్ టెక్నాలజి, పర్యావరణం, కళలు, సాంస్కృతిక తదితర రంగాలలో ప్రతిభ కనపరచిన బాలబాలికలు మరియు సంస్థలు వారి యొక్క ధరఖాస్తులను ఆగస్టు 31వ తేదీ లోపల https://awards.gov.in వెబ్ సైట్ నందు ధరఖాస్తు చేసుకోగలరని తెలిపారు.

# అండర్-19 జట్టులోకి ద్రవిడ్ కుమారుడు



**బలగం టీవీ , సిరిసిల్ల**

రాహుల్ ద్రావిడ్ కుమారుడు సమిత్ ద్రావిడ్ భారత అండర్-19 జట్టులో చోటు సంపాదించాడు. ఆస్ట్రేలియాతో జరగనున్న మల్టీ ఫార్మాట్ సిరీస్‌కు అతన్ని ఎంపిక చేశారు. అండర్-19 ఆస్ట్రేలియా జట్టుతో.. పుదుచ్చేరిలో మూడు వన్డేలు, చెన్నైలో 4 రోజుల మ్యాచ్‌లు రెండు జరగనున్నాయి. సెప్టెంబర్ 21, 23, 26 తేదీల్లో ఆ మ్యాచ్‌లు జరగనున్నాయి. ఆ వన్డే సిరీస్‌కు యూపీకి చెందిన మొహమ్మద్ అమన్ కెప్టెన్సీ బాధ్యతలు చేపట్టనున్నాడు. ఆ తర్వాత చెన్నై వేదికగా నాలుగు రోజుల మ్యాచ్‌లు రెండు జరగనున్నాయి. సెప్టెంబర్ 30 నుంచి అక్టోబర్ ఏడో తేదీ వరకు ఆ మ్యాచ్‌లు ఉంటాయి. మధ్యప్రదేశ్‌కు చెందిన సోహమ్ పట్వర్ధన్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు.

పేస్ బౌలింగ్ ఆల్ రౌండర్ సమిత్ ప్రస్తుతం కేఎస్సీఏ మహారాజా టీ20 ట్రోఫీలో మైసూరు వారియర్స్ తరపున ఆడుతున్నాడు. ఏడు ఇన్నింగ్స్‌లో 82 రన్స్ చేశాడు. 33 హయ్యెస్ట్ స్కోరు. టోర్నీలో అతను ఇంకా బౌలింగ్ చేయాల్సి ఉంది. కూచ్ బిహారీ ట్రోఫీలో సమిత్ కీలక పాత్ర పోషించి కర్నాటక టైటి ల్ గెలిచేందుకు తోడ్పడ్డాడు. ఆ టోర్నీలో 18 ఏళ్ల సమిత్.. 8 మ్యాచుల్లో 362 రన్స్ చేశాడు. 16 వికెట్లు తీశాడు.

# పారాలింపిక్స్‌లో భారత్ జోరు




**బలగం టీవీ , సిరిసిల్ల**

పారాలింపిక్స్‌లో భారత పారా అథ్లెట్లు అదరగొడుతున్నారు. విశ్వక్రీడలు ప్రారంభమైన రెండో రోజే పతకాల ఖాతా తెరిచారు. పారా షూటర్ అవని లెఖరా మహిళల 10మీటర్ల ఎయిర్ రైఫిల్ ఈవెంట్‌లో పసిడి పతకం నెగ్గింది. ఈ ఈవెంట్లో 249.7పాయింట్లతో అవని సత్తా చాటింది. గత టోక్యో పారాలింపిక్స్‌లోనూ గోల్డ్ నెగ్గిన అవని, ఈసారి పారిస్‌లోనూ సత్తా చాటి పసిడి దక్కించుకుంది. టోక్యోలో 249.6పాయింట్లు సాధించిన అవని ఈసారి తన రికార్డును మెరుగుపర్చుకుంది. పారాలింపిక్స్‌లో రెండు గోల్డ్ మెడల్స్? నెగ్గిన రెండో భారత పారా అథ్లెట్‌గా అవని రికార్డు సృష్టించింది. అయితే 11 ఏళ్ల వయసులో కారు ప్రమాదానికి గురికావడం వల్ల అవని కాళ్లు రెండూ చచ్చుబడిపోయాయి. అప్పటి వరకు ఆమె లోకం వేరు! చదువు తప్ప వేరే ధ్యాస లేదు. ఆ తర్వాత ఆమె ఆర్చరీవైపు దృష్టి పెట్టి దీన్నే కెరీర్‌గా మలుచుకుంది. ఇక మరోవైపు ఇదే ఈవెంట్‌లో మోనా అగర్వాల్ మూడో స్థానంలో నిలిచి కాంస్యం ముద్దాడింది. ఈమె 228.7 పాయింట్లు సాధించింది. ఇక సౌత్ కొరియా పారా అథ్లెట్ యె లీ 246.8 పాయింట్లతో రెండో స్థానంలో నిలిచి సిల్వర్ పతకం దక్కించుకుంది.

స్ప్రింటర్ ప్రీతి పాల్ 100 మీటర్ల పరుగు పందెంలో మూడో స్థానంలో నిలిచి కాంస్యం దక్కించుకుంది. ఈ ఈవెంట్‌లో ప్రీతి ఆమె 14.21 సెకన్లలో పరుగు పూర్తి చేసింది. కాగా, ఈ విభాగంలో ఇదే ప్రీతి బెస్ట్ టైమ్. ఇక తొలి రెండు స్థానాలను చైనాకు చెందిన అథ్లెట్లు కైవసం చేసుకున్నారు. రేస్‌ను 13.58 సెకన్లలో ముగించిన జియా జౌ పసిడి ముద్దాడగా, 13.74 సెకన్లలో పరుగును పూర్తి చేసిన గౌ రజకం దక్కించుకుంది.

భారత పారా షూటర్ మనీశ్ నర్వాల్ శుక్రవారం జోరు ప్రదర్శించాడు. పురుషుల 10మీటర్ల ఎయిర్ పిస్టల్ ఈవెంట్‌లో రెండో స్థానంలో నిలిచిన మనీశ్ రజతం దక్కించుకున్నాడు. ఈ పతకంతో భారత్ ఖాతాలో ఒకేరోజు ఓ స్వర్ణం, ఓ రజతం, రెండు కాంస్యాలు చేరాయి.

# యూఎస్ ఓపెన్‌లో జోకోవిచ్‌కు షాక్



**బలగం టీవీ , సిరిసిల్ల**

యూఎస్ ఓపెన్ నుంచి డిఫెండింగ్ చాంపియన్ నోవాక్ జోకోవిచ్ నిష్క్రమించాడు.మూడవ రౌండ్ మ్యాచ్‌లో 28వ సీడ్ ఆస్ట్రేలియా ప్లేయర్ అలెక్సీ పాపిరిన్ 6-4, 6-4, 2-6, 6-4 స్కోరు తేడాతో జోకోవిచ్‌పై గెలుపొందాడు. శుక్రవారం మరో స్టార్ ప్లేయర్ కార్లోస్ అల్కరాజ్ కూడా యూఎస్ ఓపెన్ నుంచి నిష్క్రమించిన విషయం తెలిసిందే. రెండో సీడ్ జోకోవిచ్.. 25వ గ్రాండ్‌స్లామ్‌పై కన్నేశాడు. కానీ అతని దూకుడుకు యూఎస్ ఓపెన్‌లో తీవ్ర అడ్డు తగిలింది. జూన్‌లో మోకాలి సర్జరీ చేయించుకున్న జోకోవిచ్.. ఈ ఏడాది ఒక్క మేజర్ గ్రాండ్‌స్లామ్ కూడా గెలవలేకపోయాడు. 37 ఏళ్ల జోకోవిచ్ యూఎస్ ఓపెన్‌లో పది సార్లు ఫైనల్లోకి ప్రవేశించాడు. 2011, 2015, 2018, 2023లో టైటిల్స్ గెలిచాడు. శుక్రవారం రాత్రి జరిగిన మ్యాచ్‌లో అతను 14 సార్ల డబుల్ ఫాల్ట్ చేశాడు. శారీరకంగా అలసిపోయినట్లు కనిపించాడు.

# పవర్ లిఫ్టింగ్‌లో తెలుగు యువత సత్తా

**బలగం టీవీ , సిరిసిల్ల**

ప్రపంచ జూనియర్ ఎక్విప్‌డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2024 పోటీల్లో రాష్ట్ర క్రీడాకారులు సత్తా చాటారు. మాల్టాలో జరుగుతున్న ఈ పోటీల్లో డి మురళీకృష్ణ 59 కిలోల విభాగంలోనూ, షేక్ సాదియా అల్మాస్ 57 కిలోల విభాగంలోనూ స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. మురళీకృష్ణ స్వస్థలం కృష్ణా జిల్లా కాగా ఆయన ఈ పోటీల్లో కడప జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించారు. 59 కిలోల కేటగిరిలో డెడ్‌లిఫ్ట్, స్క్వాట్ లో మొత్తం 633 కిలోలతో ఓవరాల్ గోల్డ్ మెడల్ సాధించారు. జూనియర్ డెడ్‌లిఫ్ట్‌లో 265.5కిలోలతో సరికొత్త ప్రపంచ రికార్డు నెలకొల్పారు.

గుంటూరు జిల్లా మంగళగిరికి చెందిన షేక్ సాదియా అల్మాస్ 57 కిలోల విభాగంలో స్క్వాట్ (190 కిలోలు), డెడ్‌లిఫ్ట్ (175 కిలోలు) మొత్తం 462.5 కిలోలతో ఓవరాల్ గోల్డ్ మెడల్ కైవసం చేసుకున్నారు. ప్రపంచ స్థాయిలో తెలుగుకీర్తిని చాటిన సాదియా, మురళీకృష్ణను ఆంధ్రప్రదేశ్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు గంటా వెంకటేశ్వర్లు, ప్రధానకార్యదర్శి ఎస్ సూర్యనారాయణ, కోశాధికారి సిహెచ్ శేషుబాబు, గౌరవాధ్యక్షులు ఎం ప్రభాకరరావు అభినందించారు. ఈ పోటీల్లో రాష్ట్రం నుంచి నలుగురు క్రీడాకారులు పాల్గొంటున్నారని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సూర్యనారాయణ తెలిపారు

# పాకిస్థాన్ ఆలౌట్




**బలగం టీవి, హైదరాబాద్**

రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పాకిస్థాన్ బ్యాటర్లు తేలిపోయారు. రావల్పిండిలో ఓపెనర్ సయూం అయూబ్(58), కెప్టెన్ షాన్ మసూద్(57)లు మంచి పునాది వేసినా.. బంగ్లాదేశ్ స్పిన్నర్ల ధాటికి మిగతా వాళ్లు చేతులెత్తేశారు. ఆఖర్లో అఘా సల్మాన్(54) అర్ధ శతకంతో పోరాడి పాక్ పరువు కాపాడాడు. తొలి టెస్టు రెండో ఇన్నింగ్స్‌లో పాక్‌ను ముంచిన యువ స్పిన్నర్ మెహిదీ హసన్ మిరాజ్(5/61) మళ్లీ విజృంభించడంతో పాక్ 274 పరుగులకే ఆటౌటయ్యింది.

తొలి రోజు వర్షార్పణం కావడంతో రెండో రోజు టాస్ గెలిచిన బంగ్లాదేశ్ బౌలింగ్ తీసుకుంది. ఇన్నింగ్స్ ఆరంభంలోనే ఓపెనర్ షఫీక్ అబ్దుల్లా(0)ను తస్కిన్ అహ్మద్ డకౌట్‌గా వెనక్కి పంపాడు. ఆ తర్వాత సయూం అయూబ్ (58) జతగా సారథి షాన్ మసూద్(57) విలువైన ఇన్నింగ్స్ ఆడాడు. వీళ్లిద్దరూ బంగ్లా బౌలర్లను దీటుగా ఎదుర్కొని అర్ధ శతకాలతో చెలరేగారు. రెండో వికెట్‌కు 107 పరుగులు జోడించి పాక్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపారు.

ప్రమాదకరంగా మారుతున్న ఈ జోడీని మెహిదీ హసన్ మిరాజ్ విడదీశాడు. మొదట మసూద్‌ను ఎల్బీగా దొరకబుచ్చుకొని.. ఆ కాసేపటికే ఆయూబ్‌ను సైతం పెవలియన్ పంపాడు. అక్కడితో పాక్ పతనం మొదలైంది. బాబర్ ఆజాం(31), సాద్ షకీల్(16), మహ్మద్ రిజ్వాన్(29)లు విఫలమవ్వగా.. అఘా సల్మాన్(54) అద్భుత పోరాటంతో జట్టు స్కోర్ 250 దాటించాడు. అనంతరం బ్యాటింగ్ ప్రారంభించిన బంగ్లాదేశ్ 2 ఓవర్లలో వికెట్లేమీ నష్టపోకుండా 10 పరుగులు చేసింది.

# రెండు రోజుల వ్యవధిలోనే రెండు సెంచరీలు

**బలగం టీవి, హైదరాబాద్**

ప్రపంచ క్రికెట్‌లో ఇంగ్లండ్ మాజీ కెప్టెన్ జో రూట్ రికార్డులు బద్దలు కొడుతున్నాడు. రెండు రోజుల వ్యవధిలోనే రెండు సెంచరీతో చెలరేగిన రూట్.. ఇంగ్లండ్ తరపున అత్యధిక శతకాల వీరుడిగా అవతరించాడు. లార్డ్స్‌లో జరుగుతున్న రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో మూడంకెల స్కోర్ అందుకొని.. 33వ సెంచరీతో అలెస్టర్ కుక్ రికార్డు సమం చేశాడు. రెండో ఇన్నింగ్స్‌లోనూ క్రీజులో పాతుకుపోయిన రూట్ శతక గర్జనతో కుక్‌ను దాటేశాడు. అంతేకాదు ఫ్యాబ్- 4లో తానే మేటి క్రికెటర్ అని ప్రపంచానికి చాటాడు.




సుదీర్ఘ ఫార్మాట్ అంటే చాలు పరుగుల వరద పారించే రూట్ లంక బౌలర్లను ఉతికేస్తూ శతక గర్జన చేశాడు. తనకెంతో ఇష్టమైన లార్డ్స్ స్టేడియంలో 33వ టెస్టు సెంచరీ నమోదు చేశాడు. తద్వారా ఇంగ్లండ్ తరపున అత్యధిక శతకాలు బాదిన రెండో బ్యాటర్‌గా రూట్ రికార్డు నెలకొల్పాడు. మాజీ కెప్టెన్ అలిస్టర్ కుక్ పేరిట ఉన్న ఆల్‌టైమ్ రికార్డును సమం చేశాడు. ఓవైపు సహచరులు పెవిలియన్‌కు క్యూ కడుతున్నా.. పట్టుదల వీడకుండా ఆడుతున్న రూట్ డ్రింక్స్ బ్రేక్ సమయానికి రూట్ 128 పరుగులతో నాటౌట్‌గా నిలిచాడు.

ఇక మ్యాచ్ విషయానికొస్తే ఇంగ్లాండ్ రెండో ఇన్నింగ్స్‌లో 427 పరుగులు చేసి ఆలౌటైంది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంక రెండు వికెట్ల నష్టానికి 53 పరుగులు చేసింది. ఇంకా శ్రీలంక గెలవాలంటే 430 పరుగులు చేయాలి

# 15 రోజులు మాకు నిద్ర లేదు



● **నేచురల్ స్టార్ నాని**

**బలగం టీవి, హైదరాబాద్**

నేచురల్ స్టార్ నాని 'సరిపోదా శనివారం' సినిమాతో లేటెస్ట్‌గా భారీ విజయం ఖాతాలో వేసుకున్నారు. వివేక్ ఆత్రేయ తెరకెక్కించిన ఈ సినిమా ఆగస్టు 29న రిలీజై సూపర్ రెస్పాన్స్‌తో దూసుకుపోతోంది. ఈ నేపథ్యంలో మూవీయూనిట్ శనివారం హైదరాబాద్‌లో సక్సెస్ ఈవెంట్ నిర్వహించింది. ఈ ఈవెంట్‌కు హీరో నాని సహా హీరోయిన్ ప్రియాంకా మోహన్, సీనియర్ నటుడు సాయికుమార్, దర్శక నిర్మాతలు హాజరై తమ ఆనందం వ్యక్తం చేశారు. ఇక ఈ ఈవెంట్‌లో నాని మాట్లాడారు. సినిమా రిలీజ్‌కు ముందు ఎంత ఒత్తిడికి గురయ్యారో గుర్తుచేసుకున్నారు.'పనిచేసే ఒత్తిడిలో సినిమాకు 15 రోజుల ముందు నాతోపాటు మూవీటీమ్‌కు కూడా నిద్రలేదు. నేను ప్రమోషన్స్ కోసం తిరగ్గా, మూవీటీమ్ మిగిలిన పనుల్లో బిజీగా ఉండడంతో నిద్ర లేదు. అప్పుడు ఒత్తడి వల్ల నిద్రలేదు. ఇప్పుడు మళ్లీ మూడు రోజుల నుంచి ఆనందంతో నిద్ర పట్టడం లేదు. పడుకున్నా అరగంటకే లేస్తున్నాను. చాలా ఎగ్జైట్‌మెంట్‌లో ఉన్నాను. మా సినిమాను అందరూ చాలా బాగా ఆదరించారు. అన్ని సెంటర్లలో హౌస్ ఫుల్ షో స్‌తో రన్ అవుతోంది. థాంక్యూ. ఇక సెప్టెంబర్ 5న 'సరిపోదా శనివారం' గ్రాండ్ సక్సెస్ మీట్ ఉంటుంది' అని నాని అన్నారు.

డైరెక్టర్ వివేక్‌మాట్లాడారు. తనపై ఆయన కంటే నానికే ఎక్కువ నమ్మకం అని పేర్కొన్నారు. 'ఆనందంతో మాటలు రావడం లేదు. నాపై నాకున్న నమ్మకం కంటే నానికి నాపై ఉన్న నమ్మకం ఎక్కువ. ఇంట్రో సీన్‌లో సగం గడ్డంతో కనిపించాలని చెప్పినప్పుడు ఆయన ఏమాత్రం సంకోచించలేదు. చేసేద్దాం అన్నారు. ఆయన అంత స్వేచ్ఛ ఇచ్చారు. నన్ను నమ్మి ఈ స్కేల్‌లో బడ్జెట్ పెట్టిన నిర్మాత దానయ్యకు ధన్యవాదాలు. ఈ మూవీలో నేను బాగా ఎంజాయ్ చేసిన రాసిన పాత్రలు ఒకటి సూర్య, మరొకటి దయానంద్. ఎస్.జె.సూర్యకు వస్తున్న రెస్పాన్స్ చూస్తుంటే సంతోషంగా ఉంది. ఆ పాత్రకు ప్రాణం పోశారు' అని వివేక్ అన్నారు.

# మలయాళ సినీ పరిశ్రమను నాశనం చేయకండి



● **మోహన్ లాల్**

**బలగం టీవి, హైదరాబాద్**

మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యుడు మాలీవుడ్ సీనియర్ యాక్టర్ సిద్ధిఖీ తనను ట్రాప్ చేసి రేప్ చేశాడంటూ మలయాళ నటి రేవతి సంపత్ చేసిన వ్యాఖ్యలు ఇండస్ట్రీ సర్కిల్‌లో దుమారం రేపుతున్న విషయం తెలిసిందే. అయితే కమిటీ సభ్యుల్లో కొందరిపై వస్తోన్న ఆరోపణల నేపథ్యంలో నైతిక బాధ్యత వహిస్తూ అమ్మ ప్రెసిడెంట్ మోహన్‌లాల్‌తోపాటు మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ సభ్యులందరూ రాజీనామా చేశారు.

అయితే మలయాళ మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పదవికి రాజీనామా చేసిన నటుడు మోహన్ లాల్ తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించాడు. హయత్ రీజెన్సీలో కేరళ క్రికెట్ లీగ్‌ను ప్రారంభించిన అనంతరం మోహన్‌లాల్ మీడియాతో మాట్లాడుతూ.. 'అమ్మ (మలయాళ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) అనేది ట్రేడ్ యూనియన్ కాదని ఇది ఒక కుటుంబం లాంటిదని తెలిపారు. అమ్మ అసోసియేషన్‌పై లైంగిక ఆరోపణలు రావడం దురదృష్టకరం. అమ్మ కోసం చాలా మంచి పనులు చేశాం. మన ఇండస్ట్రీలో పరిస్థితి. ఇతర చిత్ర పరిశ్రమల కంటే మెరుగ్గా ఉంది అంటూ వెల్లడించారు.

మలయాళ మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ పేరుని చెడగొట్టకండి. దీనిపై ఫోకస్ చేయకండని మీడియాతో పాటు ప్రేక్షకులను అభ్యర్థిస్తున్నాను. హేమ కమిషన్‌ను విచారణ జరుగుతోంది. తీర్పు వచ్చే వరకు వెయిట్ చేద్దాం. దయచేసి మలయాళ సినీ పరిశ్రమను నాశనం చేయకండి అంటూ మోహన్ లాల్ తెలిపారు. ఒక నటుడిగా నిర్మాతగా నా హెూదాలో రెండుసార్లు హేమా కమిషన్‌కు నా వాంగ్మూలం కూడా ఇచ్చాను. కమిటీ రిపోర్ట్‌ను నేను స్వాగతిస్తున్నాను. మహిళలను వేధించిన దోషులను కచ్చితంగా చట్టం ముందు నిలబెట్టాలి. అందుకు పోలీసులకు సాధ్యమయ్యే ప్రతి విధంగా సహకరిస్తాం. అలాగే తాను ఏ అధికార వర్గానికి చెందినవాడిని కానని మలయాళ చిత్ర పరిశ్రమ చాలా మందికి జీవనోపాధిగా ఉందని.. దానికి టార్గెట్ చేయవద్దని లాల్ మీడియాకు విజ్ఞప్తి చేశారు.